పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్ఆర్ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్ఆర్ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్తదానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మున్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేధోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపూరాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

మాఘమాసంలో పెళ్లిళ్లే పెళ్లిళ్లు

- ముందుగానే ఫంక్షన్ హాళ్ల బుకింగ్
- నేటి నుంచి సందడి షురూ

వేములవాడ టౌన్,జనవరి 30 : కల్యాణ ఘడియలొచ్చేశాయి. రేపటి నుంచి అన్ని మంచిరోజులే అని పురోహితులు చెబుతున్నారు. వసంతపంచమి మంచి ముహూర్తమని, నేటి నుంచి మార్చి 10 వరకు అన్ని మంచి ముహూర్తాలేనని అంటున్నారు. దీంతో జిల్లాలో చాలా ఇళ్లల్లో పెళ్లి సందడి షురూ కా నుంది. నేడు 31, ఫిబ్రవరి 3,7,10,13,15,17,19,23, మార్చి 2,6,10 తేదీల్లో పెళ్లిళ్లు, శంకుస్థాపనలు,గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు జరిపించుకోవచ్చునని పురోహితులు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 300 మంది పురోహితులు ఉన్నారు. వివాహ స్థాయిని బట్టి పురోహితులు రూ.25 వేల నుంచి 30 వేల వరకు తీసుకుంటారు. మరోవైపు కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్ కనిపిస్తోంది. పెళ్లిళ్లు రెండు,మూడు నెలల ముందుగానే నిశ్చయమవడంతో అప్పట్లోనే వీటిని బుక్ చేసుకున్నారు. దీంతో ఇప్పుడు వేములవాడ పట్టణంతో పాటు ఉమ్మడి జిల్లాల్లోని వివాహ వేదికలు ఖాళీలేకుండా పోయాయి. కొందరు ధనికులు పేరున్న హోటళ్లలో వివాహాలు జరిపించుకుంటున్నారు. నగరంలోని కొన్ని ప్రైవేటు ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు 50 వేలనుంచి 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

ఫిబ్రవరిలో మంచి ముహూర్తాలు..

మాఘమాసం (ఫిబ్రవరి)లో సెంటిమెంట్‌గా భావించి పెళ్లిళ్లు చేయడానికి ఎక్కువమంది మొగ్గుచూపుతారు. ఫిబ్రవరిలో ఎనిమిది రోజులు మంచి ముహూర్తాలున్నాయి. అందువల్ల ఆయా తేదీల్లో వివాహాలకు ప్రాధాన్యమిస్తున్నారు.దీంతో పురోహితులకు డిమాండ్ ఏర్పడింది.

-నటరాజ్, పురోహితుడు (వేములవాడ)

రోడ్డు పనులపై దళిత రైతు అభ్యంతరం

దుమాలలో ఎస్కవేటర్‌కు అడ్డుగా నిలుచున్న మహిళా రైతు కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 30: తాము దళితులమనే వివక్షతోనే ఇద్దరి మధ్యనున్న రోడ్డును సమానంగా తీయకుండా తమ భూమి నుంచి ఎక్కువ భాగం తీసేందుకు రెవెన్యూ అధికారులు పాల్పడుతున్నారని ఓ మహిళా రైతు అభ్యంతరం చెప్పి పనులను అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సర్వే నెంబర్ 240లో రామిండ్ల దేవలక్ష్మికి ఎకరం భూమి ఉంది ఆమె పొలానికి ఎదురుగా మరో రైతుకు పొలం ఉండగా ఇరువురు పొలాల మధ్య నుంచి దుమాల-అక్కపల్లి గ్రామాలను కలిపే రోడ్డును వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరువురు పొలాల మధ్య ఇది వరకు ఉన్న రోడ్డు మధ్య నుంచి రోడ్డు విస్తరణ కోసం సమానంగా భూమిని తీయాల్సింది పోయి తమ భూమి నుంచే ఎక్కువ భాగం తీస్తున్నారని దేవలక్ష్మి ఆరోపించింది. తమ కుటుంబ సభ్యులతో కలిసి నిర్మాణ పనులను ఆ పొలాని రోడ్డుపై అడ్డుగా నిలుచున్నది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు సైతం తమకు నష్టం కలిగేలా హద్దులు నిర్ణయిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నది.

అసంపూర్తి బ్రిడ్జితో ప్రయాణికులకు ఇబ్బంది

ఇల్లంతకుంట, జనవరి 30 : మండల కేంద్రం నుంచి అనంతారం గ్రామానికి మధ్యలో ఉన్న బిక్క వాగుపై బ్రిడ్జిపై రోడ్డు నిర్మాణం అసం పూర్తిగా చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ మండల నాయకుడు అక్కెం నాగరాజు అన్నారు. గురువారం బ్రిడ్జి వద్ద రోడ్డు దుస్థితిని చూసి మట్లాడారు. దాదాపు రూ.3 కోట్ల నిధులతో బ్రిడ్జి పనులను గత ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిందన్నారు. ఇప్పుడు సంవత్సరంనర కాలం పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటివరకు పట్టించే కోలేదన్నారు. బ్రిడ్జికి రెండు వైపులా రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ర్యాంపు రోడ్డు నిర్మించి రోడ్డు చివరలకు సేఫ్టీ నిర్మించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించి చివరలకు సేఫ్టి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

యాంటీవీనమ్ అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వీర్నపల్లిలో పీహెచ్‌సీ ప్రారంభం

వీర్నపల్లి : పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వీర్నపల్లి, జనవరి 30: పాముకాటు బాధితులకు ఇచ్చే యాంటీవీవీనమ్ ఇంజెక్షన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యసిబ్బందిని అదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం తాత్కలికంగా ఏర్పాటు చేసిన భవనాన్ని జిల్లా వైద్యాధికారిని డాక్టర్ రజితతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో బెడ్‌లు, సామగ్రిని పరిశీలించారు. పాముకాటు బాధితులు ఎక్కువగా రైతులే ఉంటారని, యాంటీవీన్మ్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఇక్కడ ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ మా రుతిరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వహిద్, మండల వైద్యాధికారిణి సరియా అంజుమ్, ఎస్ఐ ఎల్లాగౌడ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రావద్దు

కలెక్టరేట్, జనవరి 30 : రాబోయే వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మిషన్ భగీరథ, తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్ తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు సంబంధించి ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. తాగునీటి వృథాను నివారించాలని, టోల్ ఫ్రీ నంబర్ 1800-599-4007 ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, మిషన్ భగీరథ గ్రిడ్, డీఈ రాము, ఎంపీడీవోలు, ఏఈలు, అధికారులున్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టరేట్, జనవరి 30: జిల్లా జనరల్ దవాఖానలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) అభివృద్ధి సమావేశం కలెక్టర్ నిర్వహించారు. పీడియాట్రిక్ వార్డు, పోస్టు ఆపరేటివ్ వార్డు, ఓటీ వెనుక వైపున గల లీకేజీలు, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి రజిత, వేములవాడ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులున్నారు.

17వ పోలీస్ బెటాలియన్ సందర్శన

వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రమేశ్

సిరిసిల్ల రూరల్, జనవరి 30: సిరిసిల్లలోని 17వ పోలీస్ బెటాలియన్‌ను గురువారం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, అడిషనల్ ఐజీపీ రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా 17వ బెటాలియన్‌లో నిర్మాణంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్, బెల్ ఆఫ్ ఆర్మ్స్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలి

వేములవాడ, జనవరి 30: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటుగా, ఉన్నత లక్ష్యాలను చేరేలా మార్గనిర్దేశం చేయాలని జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్, మార్గదర్శకత్వంపై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. విద్యార్థులు చదువు సక్రమంగా కొనసాగించడంలో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారిని శైలజ, మండల విద్యాధికారి బన్నాజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఆర్‌పీలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జనవరి 30: తాళం వేసిన ఇంటిలో దొంగతనం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, నారాయణపూర్‌కు చెందిన వంగల మోహన్‌రెడ్డి ఈ నెల 24న మరణించగా అతని కుమారుడు లక్ష్మారెడ్డి సదరు ఇంటిని వదిలి మరోచోట అద్దెకు ఉంటున్నాడు. ఈ నెల 28న లక్ష్మారెడ్డి తమ ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఇంట్లో ఉన్న బీరువా వైపు పరిశీలించాడు. బీరువా తెరిచి ఉండగా అందులో నుంచి రూ.10 వేలు చోరీకి గురైన విషయం తెలుసుకుని లక్ష్మారెడ్డి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేయగా అదే గ్రామానికి చెందిన అక్కపల్లి సంజీవ్, పెద్దోల్ల మనోజ్ జల్సాలకు అలవాటు పడి లక్ష్మారెడ్డి ఇంటిలో దొంగతనం చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌